క్లుప్తంగా

102 మందికి కంటి వైద్య పరీక్షలు



రేపల్లె రూరల్: పట్టణంలోని బార్ అసోసియేషన్ హాలులో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో రేపల్లె బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏ ప్రభాకర్‌రావు జ్ఞాపకార్థం బుధవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో ఫోకస్ ఐ కేర్ హాస్పిటల్ వైద్యులు 102 మందికి కంటి పరీక్షలు బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. వైద్య శిబిరాన్ని సీనియర్ సివిల్ జడ్జి కే వెంకటేశ్వర్లు ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి రూపశ్రీ, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కుమారి గీత, రేపల్లె రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ వసంతం వీరరాఘవయ్య, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.గిరిధర్, ఫోకస్ ఐ కేర్ హాస్పిటల్ ఎండీ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాలు ఆలోచనా పరిధిని విస్తృతం చేస్తాయి

మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి



బాపట్ల: పుస్తకాలు మన ఆలోచనా పరిధిని విస్తృతం చేయటంతోపాటు మన జీవితాల్లో వెలుగులు నింపి, మనకు దారి చూపుతాయని మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి అన్నారు. ప్రపంచ పుస్తక దినోత్సవం సందర్భంగా బుధవారం స్థానిక శాఖా గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శనకు ఆయన ప్రారంభోత్సవం చేశారు. పుస్తక పఠనం మనిషిలో మానవీయ కోణాన్ని పెంచుతుందని, సంపూర్ణమైన జీవనాన్ని గడపడానికి దోహదపడుతుందన్నారు. భావపురి పుస్తకోద్యమ సమితి, శాఖా గ్రంథాలయం సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి ఎ.శివాజీ గణేషన్, సమితి అధ్యక్షుడు డాక్టర్ పీసీ సాయిబాబు, కార్యదర్శి జి.వెంకటేశ్వర్లు, ఎం.నరసింహారావు, పాఠకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

దైవ సేవతో మానసిక ప్రశాంతత



రేపల్లె రూరల్: దైవ సేవతో మానసిక ప్రశాంతత కలుగుతుందని వైఎస్సార్‌సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరి గణేష్ అన్నారు. చెరుకుపల్లి మండలం తుమ్మలపాలెం పంచాయతీ అక్కల వెంకటరెడ్డి పాలెంలో బుధవారం జరిగిన అభయ ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి ఒక్కరూ దైవ సేవకు కొంత సమయం కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ దుండి వెంకటరామిరెడ్డి, నాయకులు బిట్టు సాంబశివారెడ్డి, అప్పిరెడ్డి, అక్కల గోపిరెడ్డి, అంజిరెడ్డి, తుమ్మ కష్టారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై సమావేశం



వేమూరు: ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపాలని రేపల్లె డివిజన్ సహాయ వ్యవసాయ అధికారి ఆర్ విజయబాబు తెలిపారు. మండల కేంద్రంలోని ప్రకృతి వ్యవసాయంపై మహిళ సంఘాలతో బుధవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళ సంఘాలు ప్రకృతి వ్యవసాయాన్ని ముందుకు తీసుకెళ్లాలని ఆయన కోరారు. మొక్క ఆరోగ్య కోసం, పిల్లల భవిష్యత్తు కోసం ప్రకృతి వ్యవసాయం చేయాలని ఆయన చెప్పారు. మండల వ్యవసాయాధికారి సునీత మాట్లాడుతూ ఖరీఫ్ యాక్షన్ ప్లాన్ 2025 గురించి వివరించారు. ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయాన్ని ముందుకు తీసుకెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో మోహనరావు, మహిళలు పాల్గొన్నారు.

ఉగ్రదాడికి నిరసనగా కొవ్వొత్తుల ర్యాలీ

తెనాలిరూరల్: కాశ్మీర్‌లోని బైసరన్ వ్యాలీలో పర్యాటకులపై ఉగ్రవాదులు దాడి చేసి హత్య చేయడాన్ని నిరసిస్తూ జనసేన పార్టీ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి కొవ్వొత్తు ర్యాలీ నిర్వహించారు. బోస్‌రోడ్డులోని పార్టీ కార్యాలయం నుండి ర్యాలీగా గాంధీచౌక్‌కు చేరుకుని ఉగ్రదాడిలో మృతి చెందిన పర్యాటకులకు నివాళి అర్పించి సంతాపం తెలిపారు.

అధికారుల నిర్లక్ష్యం.. క్షీణించిన పారిశుద్ధ్యం

- రహదారుల వెంట పేరుకుపోతున్న చెత్త నిల్వలు
- డ్రెయిన్లలో పారని మురుగు
- చెత్త నిల్వల్లో పందుల స్వైర విహారం



మౌంట్‌ఫోర్టు స్కూల్ రోడ్డులో చెత్త నిల్వలో పందుల సంచారం



24వ వార్డులో చెత్త నిల్వలు

రేపల్లె రూరల్: పట్టణంలో పారిశుద్ధ్యం క్షీణించింది. ప్రధాన వీధులతోపాటు అంతర్గత రహదారులు, మురికివాడల్లో చెత్త నిల్వలు పేరుకుపోతున్నాయి. రోజుల తరబడి రహదారుల వెంట చెత్త నిల్వలు ఉండడంతో ఆయా ప్రాంతాలు దుర్గంధ భరితంగా మారుతున్నాయి. దీంతో పాటు చెత్త నిల్వలు పేరుకుపోవటంతో పందుల సంచారం అధికమైంది. పందులు విచ్చలవిడిగా సంచరిస్తూ చెత్త కుప్పలను కలచివేస్తూ రహదారిపై చిమ్మటంతో ఆ ప్రాంతాలు అపరిశుభ్రంగా మారుతున్నాయి. అయినా అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు. చెత్త నిల్వలు పేరుకుపోవడం, పందుల సంచారం పెరగటంతో అంటు వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని పట్టణవాసులు భయాందోళన చెందుతున్నారు.

కనిపించని చెత్త కుండీలు

పట్టణంలోని ప్రధాన వీధులతోపాటు వార్డుల్లోని వీధులలో ప్రజలు ఇంట్లోని వ్యర్థాలను పడవేసేందుకు గతంలో ఒక ప్రదేశంలో చెత్త కుండీలు ఉండేవి. ప్రస్తుతం ఆయా ప్రాంతాలలో చెత్త కుండీలు లేకపోవటంతో వార్డుల్లోని ప్రజలు, దుకాణాదారులు వ్యర్థాలను ఇష్టానుసారంగా రహదారుల పక్కనే పారబోస్తున్నారు. దీంతో పలు రహదారులు చెత్త మయంగా మారుతున్నాయి. పట్టణంలోని 22, 23వ వార్డు, మౌంట్‌ఫోర్టు స్కూల్ రోడ్డు ఉప్పాడి రోడ్డు, గరువు రోడ్డు, రైల్వేస్టేషన్ రోడ్డులతో పాటు పలు అంతర్గత రహదారులలో చెత్త కుండీలు లేకపోవటంతో రహదారుల వెంట నిత్యం చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. చెత్త నిల్వలను సకాలంలో పారిశుద్ధ్య కార్మికులు తొలగించకపోవటంతో రహదారులపైకి చేరుతుంది.



సింగం బసవ పున్నయ్య వీధిలో చెత్త నిల్వలు

పారని మురుగు.. దోమల వృద్ధి

పట్టణంలో డ్రెయిన్ల నిర్వహణ అధ్వానంగా ఉంది. చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలతో డ్రెయిన్లు నిండిపోవడంతో మురుగు నీరు పారుదలకు ఆటంకం తప్పడం లేదు. రోజుల తరబడి మురుగు పారుదల లేకపోవడంతో దోమలకు ఆవాసంగా మారుతున్నాయి. ప్రధానంగా వాడముురుగు డ్రెయిన్, రేపల్లె డ్రెయిన్‌లు చెత్తచెదారం, గుర్రపు డెక్కతో పూర్తిగా నిండిపోయాయి. దీంతో పట్టణంలోని మురుగు నీరు ఈ కాల్వల ద్వారానే పారుదల కావాల్సి ఉంది. రోజుల తరబడి నీరు నిలిచిపోవడంతో దోమలు వృద్ధి చెంది స్వైర విహారం చేస్తున్నాయి.

- దీంతోపాటు చెత్త డ్రెయిన్లలో పేరుకుపోవటంతో డ్రెయిన్లు పూడుకుపోయి మురుగునీరు పారుదలకు ఆటంకం ఏర్పడుతుది. రోజుల తరబడి చెత్త నిల్వలు తొలగించక పోవటం, డ్రెయిన్‌లలో మురుగునీరు పారుదల లేకపోవటంతో ఆయా ప్రాంతాల్లో భరించలేని దుర్గంధం వెదజల్లుతుంది. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి చెత్త నిల్వలను సకాలంలో తొలగించటంతో పాటు పారిశుద్ధ్యాన్ని మెరుగుపర్చాలని ప్రజలు, ప్రజా సంఘాలు కోరుతున్నాయి.

తూతూమంత్రంగా ఫాగింగ్

దోమల నివారణకు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో చేయబడుతున్న ఫాగింగ్ కార్యక్రమాలు తూతూ మంత్రంగా ఉంటున్నాయి. దోమల నివారణకు డ్రెయిన్‌లలో ఆయిల్ బాల్స్ వేయడంతో పాటు ఫాగింగ్ కార్యక్రమాలు నిర్వహించటంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఫాగింగ్ నిర్వహణకు వాహనం కొనుగోలు చేసినా ప్రస్తుతం పక్కన పడేసారని ప్రజల నుంచి ఆరోపణలు వినవస్తున్నాయి. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి పారిశుద్ధ్య కార్యక్రమాలను మెరుగుపరచటంతో పాటు దోమల నివారణకు చర్యలు ముమ్మరం చేయాలని కోరుతున్నారు.



ఫాగింగ్ నిర్వహిస్తున్నాం

పారిశుద్ధ్య కార్యక్రమాలు సక్రమంగా నిర్వహిస్తున్నాం. స్వచ్ఛ రేపల్లెగా తీర్చిదిద్దేందుకు ప్రజల సహకారం అవసరం. చెత్త సేకరణకు పారిశుద్ధ్య కార్మికులు నిత్యం ఇంటింటికి పర్యటిస్తున్నారు. ఆ సమయంలో ప్రజలు వ్యర్థాలను కార్మికులకు అందించాలి. రహదారుల వెంట వెయ్యటం సరికాదు. పట్టణంలో అవసరమైన చోట్ల చెత్త కుండీలను ఏర్పాటు చేస్తాం. దోమల నివారణకు ఫాగింగ్ ముమ్మరంగా నిర్వహిస్తున్నాం.

– కాకర్ల సాంబశివరావు, మున్సిపల్ కమిషనర్, రేపల్లె

వైద్య పరంగా రేపల్లె అభివృద్ధి చెందుతుంది

వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త డాక్టర్ ఈవూరి గణేష్



డాక్టర్ గణేష్‌ను సత్కరిస్తున్న డాక్టర్ సుబ్బారావు

రేపల్లె రూరల్: విద్య, వైద్య పరంగా రేపల్లె తీరప్రాంతం అభివృద్ధి చెందుతుందని వైఎస్సార్‌సీపీ రేపల్లె సమన్వయకర్త డాక్టర్ ఈవూరి గణేష్ అన్నారు. పట్టణంలోని డాక్టర్ సుబ్బారావు నిర్మించిన నూతన వైద్యశాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో బుధవారం ఆయన పాల్గొని మాట్లాడారు. వైద్యశాల సముదాయాన్ని ఆయన ప్రారంభించారు. రోగులకు అత్యుత్తమ సేవలు అందించి వారి అభిమానాన్ని చూరగొనాలన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ గణేష్‌ను డాక్టర్ సుబ్బారావు, డాక్టర్ అశోక్‌లు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ కరేటి శేషగిరిరావు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కోర్టు సిబ్బంది విధులకు ఆటంకం

ఐదుగురిపై కేసు

తెనాలిరూరల్: కోర్టు సిబ్బంది విధులకు ఆటంకం కలిగించిన ఐదుగురిపై కేసు నమోదైంది. ఓ కేసు విషయంలో తెనాలి నాజరుపేట తిరుపతమ్మ గుడి సమీపంలో ఇంటిని ఖాళీ చేయించమని ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టు సిబ్బందిని ఆదేశించింది. ఇల్లు ఖాళీ చేసేందుకు కోర్టు సిబ్బంది బుధవారం వెళ్లగా అక్కడ నివసిస్తున్న సాయిజ్యోతి, లక్ష్మి తిరుపమ్మ, వెంకటేశ్వరమ్మ, నరసింహ, వెంకటేశ్వర్లు వారిని అడ్డుకుని విధులకు ఆటంకం కలిగించారు. ఇదే విషయమై కోర్టు సిబ్బంది పోలీసులకు ఫిర్యాదు చేయగా వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

పది ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ

రేపల్లె రూరల్: పది ఫలితాలలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ప్రతిభ చాటారు. బుధవారం విడుదలైన ఫలితాలలో పట్టణ, మండలంలోని పలు పాఠశాలల విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించారు. పట్టణంలోని మున్సిపల్ హైస్కూల్ విద్యార్థి ఎన్.తేజస్విని 590, లీలాభరత్‌కుమార్ 584 మార్కులు, పేటేరు జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు గూడపాటి పూర్ణసుధాకర్ 588, వి.షణ్ముఖ దుర్గారామ్ 570 మార్కులు సాధించి ప్రతిభ కనబరిచారు. పిరాట్లంక జిల్లా పరిషత్ హైస్కూల్ నూరు శాతం ఫలితాలు సాధించింది. పాఠశాల నుంచి హాజరైన 23 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. ఫలితాలు సాధించిన విద్యార్థులను ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

- పది ఫలితాలలో విద్యార్థులు ప్రతిభ చాటారని మౌంట్ ఫోర్టు స్కూల్ ప్రిన్సిపాల్ బ్రదర్ కిరణ్ కుమార్ బుధవారం తెలిపారు. 102 మంది విద్యార్థులు ఉత్తీర్ణులై నూరు శాతం ఫలితాలు సాధించారన్నారు. వారిలో 53 మంది విద్యార్థులు 500పైగా మార్కులు సాధించారని, టి.నవ్యశ్రీ 584, కుశాల్ కుమార్ 581 మార్కులు సాధించారన్నారు.



షణ్ముఖ దుర్గారామ్



పూర్ణసుధీర్



తేజస్విని

చుండూరులో 73 శాతం



రవి శ్రావ్య

చుండూరు(వేమూరు): చుండూరు మండలంలోని పది పరీక్ష ఫలితాలు 73 శాతం సాధించడం జరిగిందని ఎంఈవో చలపతిరావు తెలిపారు. మండలంలో 360 మంది పరీక్షలు రాయగా, 262 మంది ఉత్తీర్ణత సాధించడం జరిగిందన్నారు. చుండూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 42 మందికి 25 మంది, వేటపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 27 మందికి 16 మంది, చుండూరు డాక్టర్ అంబేడ్కర్ గురుకల పాఠశాలలో 67 మందికి 51 మంది, మండూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 25 మందికి 24 మంది విద్యార్థులు పాసయ్యారు. చినపరిమి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 32 మందికి 22 మంది, మోదుకూరులో 44 మందికి 31 మంది, యడ్లపల్లిలో 86 మందికి 59 మంది విద్యార్థులు పాసయ్యారు. సెయింట్ ఆన్స్ పాఠశాలలో 37 మందికి 34 మంది పాసయ్యారని ఆయన తెలిపారు. మోదుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన బాలిక రవి శ్రావ్య 581 మార్కులతో మండలంలో ప్రథమ స్థానం సాధించడం జరిగిందని అన్నారు.

అమర్తలూరులో 77.12 శాతం



సీహెచ్ చైతన్య శ్రీ

అమర్తలూరు(వేమూరు): మండలంలో పది పరీక్ష ఫలితాల్లో 77.12 శాతం సాధించడం జరిగిందని ఎంఈవో కనపాల రమేష్ తెలిపారు. అమర్తలూరు మండలంలో 288 మంది పరీక్షలు రాయగా 224 మంది పాసయ్యారు. మూల్పూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 23 మందికి 19 మంది, పెదపూడిలో 27 మందికి 20 మంది, మోపర్రులో 24 మందికి 21 మంది, తురుమెళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9 మందికి ఆరుగురు, అమర్తలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 76 మందికి 54 మంది, గోవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 12 మందికి ఏడుగురు, ఇంటూరులో 26 మందికి 14 మంది, ప్యాపర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, 21 మందికి 19 మంది, కూచిపూడి ఎయిడెడ్ పాఠశాలలో 21 మందికి 15 మంది పాసయ్యారు. కూచిపూడి ప్రయివేటు పాఠశాలల్లో 49 మంది విద్యార్థులకు 49 మంది ఉత్తీర్ణత సాధించినట్లు ఆయన తెలిపారు. మోపర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని సీహెచ్ చైతన్యశ్రీ 585 మార్కులు సాధించడం జరిగిందని తెలిపారు.

వేమూరులో 71.5 శాతం



కంచె సుభాషిని

వేమూరు: వేమూరు మండలంలో పది పరీక్ష ఫలితాల్లో 71.5 శాతం ఉత్తీర్ణత సాధించడం జరిగిందని ఎంఈవో వెంకటేశ్వర్లు తెలిపారు. పది ఫలితాలు బుధవారం విడదల చేశారు. మండలంలో 220 మంది పరీక్షలు రాయగా 150 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. చావలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 39 మందికి 38 మంది విద్యార్థులు పాసయ్యారు. కుచ్చెళపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 19 మంది 14 మంది, వరహాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8 మందికి నలుగురు పాసయ్యారు. జంపనిలో 77 మందికి 52 మంది, పెరవలిలో 26 మందికి 22 మంది, వేమూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 51 మందికి 28 మంది పాసయ్యారన్నారు. పెరవలి పాఠశాలకు చెందిన కంచె సుభాషని 589 మార్కులు సాధించి మండలంలో ప్రథమ స్థానం, చావలి పాఠశాలకు చెందిన సోమరౌతు దివ్య 587 మార్కులతో ద్వితీయ స్థానం సాధించడం జరిగిందని తెలిపారు.

నగరంలో 84.18 శాతం



జీ కవిత

నగరం: పది పరీక్ష ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. మండలంలోని అల్లపర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన జీ కవిత 582 మార్కులు సాధించి మండలంలో ప్రథమ స్థానంలో నిలిచినట్లు ఎంఈవో పి.లాజర్ తెలిపారు. మండలంలో ఆరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, రెండు ఎయిడెడ్ పాఠశాలల నుంచి 234 మంది పరీక్షలకు హాజరవ్వగా 197 మంది విద్యార్థులు ఉత్తీర్ణత పొందగా 84.18 శాతం సాధించినట్లు ఎంఈవో పేర్కొన్నారు. పెద్దవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నూరు శాతం ఉత్తీర్ణత సాధించినట్లు వెల్లడించారు.

సత్తాచాటిన కేర్ విద్యార్థులు



అబ్దుల్ రెహ్మాన్



పవన్‌కుమార్

పిట్టలవానిపాలెం(కర్లపాలెం): పది పరీక్ష ఫలితాలలో పిట్టలవానిపాలెం మండల పరిధిలో ప్రైవేటు పాఠశాలల విభాగంలో కేర్ పాఠశాల విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించి మండలంలో ప్రథమ స్థానంలో నిలిచారు. కేర్ పాఠశాల విద్యార్థి తరుణ్‌కుమార్ 592 మార్కులతో ప్రథమ స్థానం, 591 మార్కులతో విజయ్‌కుమార్ ద్వితీయస్థానం, 588 మార్కులతో యుక్తవర్షిణీ తృతీయ స్థానంలో నిలిచారు. ప్రభుత్వ పాఠశాలల విభాగంలో చందోలు ఉన్నత పాఠశాలకు చెందిన అబ్దుల్ రెహ్మాన్ 577 మార్కులు సాధించి మండల ప్రథమ స్థానంలో నిలవగా అదే పాఠశాలకు చెందిన పవన్‌కుమార్ 571 మార్కులతో ద్వితీయ స్థానంలో నిలిచాడు. మంతెనవారిపాలెం ఉన్నత పాఠశాలకు చెందిన సువర్చల 568 మార్కులతో తృతీయ స్థానంలో నిలిచినట్లు ఉపాధ్యాయులు తెలిపారు.

కొల్లూరులో...



గొల్లపూడి వేణువర్ధన్

కొల్లూరు: పది పరీక్ష ఫలితాలలో కొల్లూరు శ్రీ సాయివాసవి విద్యా సంస్థలకు చెందిన విద్యార్థి మండల ప్రథమ స్థానం సాధించినట్లు డైరెక్టర్ ఉప్పు శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం విడుదల చేసిన ఫలితాలలో కొల్లూరుకు చెందిన గొల్లపూడి వేణువర్ధన్ 592 మార్కులు సాధించి మండల ప్రథమ స్థానం కైవసం చేసుకున్నాడు. ఇదే విద్యా సంస్థలకు చెందిన చిలుమూరి సింధు 587, జొన్నకూటి మేఘన 585 మార్కులు సాధించినట్లు తెలిపారు. మొత్తం 50 మందికి 50 మంది విద్యార్థులు ఉత్తీర్ణులై 100 శాతం ఫలితాలను సాధించారన్నారు. ఈ సందర్భంగా వేణువర్ధన్‌ను ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు. 14 మంది విద్యార్థులు 550 పైగా మార్కులు సాధించగా, 26 మంది విద్యార్థులు 500 పైబడి మార్కులు పొందినట్లు తెలిపారు.

- కొల్లూరు వివేక పాఠశాల విద్యార్థులు ప్రతిభా పాటవాలు ప్రదర్శించి పదిలో ఉత్తమ ఫలితాలు సాధించినట్లు పాఠశాల డైరెక్టర్ రావిపాటి వీరనారాయణ తెలిపారు. ఉప్పు జోషిత 590 మార్కులతో పాఠశాల ప్రథమ స్థానం, మండవ అస్మిత 589, గాజుల మహాలక్ష్మి 587 మార్కులు సాధించారన్నారు. 10 మంది విద్యార్థులు 550 పైబడి, 26 మంది 500 పైబడి మార్కులు పొందినట్లు తెలిపారు. ఉత్తమ ఫలితాలు పొందిన విద్యార్థులను ఉపాధ్యాయులు, డైరెక్టర్ వీరనారాయణ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌లు గుత్తా వెంకటరత్నం, కె.రామరాజు, డీన్ రత్నకుమారి, ప్రిన్సిపాల్ సీహెచ్.రమేష్ అభినందించారు.

కర్లపాలెంలో...



మహాలతు



అల్తాఫ్



లావణ్య

కర్లపాలెం: పది పరీక్ష ఫలితాలలో బాలికలు మండలంలో ప్రథమ స్థానం సాధించారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కంటే ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు అధిక మార్కులు సాధించారు. ప్రైవేటు పాఠశాలల విభాగంలో కర్లపాలెం పబ్లిక్ స్కూల్ విద్యార్థులు గరికపాటి మహాలతు 585, సయ్యద్ అల్తాఫ్ 585 మార్కులు సాధించి మండలంలో ప్రథమ స్థానంలో నిలిచారు. హైవెండ్ హైస్కూల్ విద్యార్థిని తేజస్విని 569 మార్కులతో ద్వితీయ స్థానంలో, కర్లపాలెం పబ్లిక్ స్కూల్ విద్యార్థులు లీలా మానస, హైవెండ్ హైస్కూల్ విద్యార్థిని యమున 565 మార్కులు సాధించి తృతీయ స్థానంలో నిలిచారు.

- ప్రభుత్వ పాఠశాలల విభాగంలో పేరలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని లావణ్య 577 మార్కులతో మండలంలో మొదటి స్థానంలో, ఆంజనేయరెడ్డి 560 మార్కులతో ద్వితీయస్థానంలో నిలిచాడు. యాజలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి ఫణికుమార్ 577 మార్కులతో తృతీయ స్థానం సాధించాడని ఉపాధ్యాయులు తెలిపారు.

వేసవిలో తాగునీరు సక్రమంగా అందించాలి



పెదగొల్లపాలెం తాగునీటి చెరువును పరిశీలించిన ఎంపీడీవో శ్రీనివాసరావు

కర్లపాలెం: వేసవిలో తాగునీరు సక్రమంగా అందించాలని ఎంపీడీవో ఎ.శ్రీనివాసరావు చెప్పారు. బుధవారం పెదగొల్లపాలెం రక్షిత మంచినీటి పథకం చెరువును ఎంపీడీవో శ్రీనివాసరావు అధికారులతో కలసి సందర్శించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ పెదగొల్లపాలెం తాగునీటి చెరువు పరిధిలో ఉన్న తీరప్రాంత గ్రామాలకు ఈ వేసవిలో తాగునీరు సక్రమంగా అందించేందుకు చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. చెరువును పూర్తి స్థాయిలో నీటితో నింపుకోవటంతో పాటు తాగునీరు సక్రమంగా గ్రామాలకు చేరేందుకు అవసరమైన చోట పైప్‌లైన్‌లకు మరమ్మతులు వెంటనే చేయించాలని చెప్పారు. ప్రస్తుతం పంట కాలువలకు తాగునీటి అవసరాల కోసం వస్తున్న నీటిని చెరువులు నింపేందుకు వినియోగించాలని ఎంపీడీవో చెప్పారు. మండల పరిధిలోని అన్ని చెరువులను తాగునీటితో నింపుకోవాలని సూచించారు.

ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ

చుండూరు(వేమూరు): ప్రకృతి వ్యవసాయం సాగు చేసేందుకు ప్రతి రైతు ముందుకు రావలని రాష్ట్ర ప్రకృతి వ్యవసాయం అసిస్టెంట్ మల్లేశ్వరి తెలిపారు. మండల కేంద్రంలోని ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ సార్వత్రిక సూత్రాలు అయిన 365 రోజులు భూమిని కప్పి ఉంచడం, పంట వైవిధ్యతను ప్రోత్సహించడం, తక్కువ లోతులో దున్నడం నాటు, దేశీ విత్తనాలు వినియోగంపై వివరించారు. వ్యవసాయంలో పశువుల అనుసంధానం గురించి వివరించారు. మాస్టర్ ట్రైనర్ వి.శ్రీనివాస్ రెడ్డి మాట్లాడారు. పురుగు తెగుళ్లు, యాజమాన్యం, రసాయనాలు వాడకపోవడం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి బండ్లమూడి ఆదాం బాబు, రైతులు పాల్గొన్నారు.



ధాన్యం లారీ బోల్తా

ఫిరంగిపురం: ప్రమాదవశాత్తు ధాన్యం తీసుకు వెళుతున్న లారీ డివైడర్‌ను ఢీకొని బోల్తా పడిన సంఘటన మండల కేంద్రంలో బుధవారం తెల్లవారు జామున చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. నరసరావుపేట సమీపంలోని పాలపాడు గ్రామం నుంచి ధాన్యం లోడుతో రాజమండ్రికి లారీ వెళుతుంది. దారిలో ఫిరంగిపురంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదురుగా ఉన్న డివైడర్‌ను ఢీకొని బోల్తా పడింది. ఈ సంఘటనలో ఎవరికీ ఎటువంటి ప్రమాదం సంభవించలేదు.